క్లుప్తంగా

బడిబయటి పిల్లల ఇంటింటి సర్వే

పాన్‌గల్: మండలంలో బడిబయటి పిల్లల ఇంటింటి సర్వే కొనసాగుతుందని ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అన్నారం, అన్నారంతండాలో సీఆర్పీలు సర్వే చేపట్టారు. మధ్యలో బడిమానివేసిన, బడిబయటి పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్‌నాయక్, భార్గవి, రమాదేవి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ



పెబ్బేరు రూరల్: మండలంలోని గుమ్మడంలో గురువారం నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, లేబరు డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు ఉచిత శిక్షణ నిర్వహించారు. వారు మాట్లాడుతూ లేబరు కార్డు కలిగిన వారందరికీ 15 రోజుల పాటు మేస్త్రి పనిలో మెళకువలు, నిర్మాణ పద్ధతుల గురించి వివరిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తర్వాత సర్టిఫికెట్, ఒక్కొక్కరికి 15 రోజులకు స్టైఫండ్ కింద రూ.4,500 అందజేస్తామని, ఈ శిక్షణను అందరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్, నిజలింగప్ప గంగాధర్‌గౌడ్, కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సమష్టిగా పనిచేద్దాం

వీపనగండ్ల: గ్రామాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో పనిచేద్దామని ఉప సర్పంచ్ నరేష్, రఘునాథ్‌రెడ్డి అన్నారు. గురువారం పుల్గర్‌చర్లలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శి బిజ్జ జగదీష్, మరో 40 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాఠశాలకు విరాళం అందజేత



పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సమస్య ఉందని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వేణాచారి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి రూ.50వేల చెక్కును హెచ్‌ఎంకు అందించారు.

విత్తనాలు నాటడంలో మెళకువలు పాటించాలి



వీపనగండ్ల: గ్రామాలలోని నర్సరీలలో మొక్కల పెంపకంలో ప్రథమ ప్రాధాన్యతగా విత్తనాలు నాటడంపై మెళకువలు పాటించాలని ఎంపీడీఓ కతలప్ప అన్నారు. గురువారం తూముకుంటలో పంచాయతీ, ఈజీఎస్ సిబ్బందితో కలిసి మట్టి నమూనాల సేకరణ, విత్తనాలు నాటడం అంశంపై పలు సూచనలు ఇచ్చారు. ఉదయం, సాయంత్రం మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందివ్వాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వహీద్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బంగారు నగలపై 85 శాతం రుణాలు

అమరచింత: తమ బ్యాంకు బంగారు నగలను తాకట్టు పెడితే 85 శాతం రుణాలను అందిస్తున్నామని యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్యాంసుందర్ అన్నారు. రైతులతో పాటు వ్యాపారస్తులకు యూనియన్ బ్యాంకు చక్కటి అవకాశం అందిస్తున్నదన్నారు. తక్కువ వడ్డీతో రుణాన్ని చెల్లించే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు పరిధిలోని నర్వ, అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో గురువారం ఆటోలో ప్రచారం నిర్వహించి రుణ వివరాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశామన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని గేమ్యానాయక్ తండా, లచ్చునాయక్ తండాల్లో మినుము, వేరుశనగ పంటలను గురువారం మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఏఈఓలు మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినుము పంటలో కాండపు ఈగ ఉధృతి అధికంగా ఉందని దీని నివారణకు ఫ్రిప్రోనిల్ లేదా రోగోర్ లేదా క్లోరోపైరి ఫాస్ వాడాలన్నారు. బూడిత తెగుళ్ల నివారణకు ఇండెక్స్ లేదా నాటినో పిచికారి చేయాలని రైతులకు సూచించారు. వేరుశనగలో వచ్చే మచ్చ తెగులు నివారణకు హెక్సకొనజోల్ లేదా ఫాలిక్యూర్ పిచికారి చేయాలని వివరించారు. అదే విధంగా వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు.

బిందుసేద్యంతో మేలు

- డ్రిప్ పద్ధతిలో ఎరువుల యాజమాన్యం
- నాణ్యమైన అధిక దిగుబడులకు మేలైన పద్ధతి



డ్రిప్ ద్వారా నీటి పంపిణీ విధానం

మదనాపురం: నీటిలో కరిగే ఎరువులను డ్రిప్ ద్వారా మొక్కలకు వివిధ దశల్లో అందించడమే ఫర్టిగేషన్ పద్ధతి. ఈ విధానంతో పంటలకు మేలు చేకూరుతుందని కేవీకే యాంత్రీకరణ శాస్త్రవేత్త మస్తానయ్య తెలిపారు. రైతులు ప్రస్తుత తరుణంలో అధిక నాణ్యత సురక్షిత ఆహార ఉత్పత్తి కోసం పెరుగుతున్న డిమాండ్లను చేరుకోవడానికి విశేషంగా కృషి చేస్తున్నారు. వ్యవసాయంలో నీటి పారుదల ద్వారా రసాయనిక ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో భూగర్భ భూ ఉపరితలంపై పోషకాల ఉధృతి పెరిగి పర్యావరణ కాలుష్యానికి దారి తీస్తుంది. అందుకే నీటిలో కరిగే రసాయనిక ఎరువులను డ్రిప్ పద్ధతిని ఉపయోగించి మొక్క వేర్లు ఉన్న చోట ఇవ్వడం ద్వారా పోషకాలు ఎక్కువగా సమృద్ధిగా అందుతాయి. మొక్కలు బలంగా ఉంటాయి. ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది. భూగర్భ జలాలు సాగు నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ఫర్టిగేషన్ ఎంతో దోహపడుతుంది. విచక్షణ రహితంగా ఎరువులు వాడకుండా సరైన పద్ధతుల్లో ఎరువులు నీటి వినియోగంతో సాగు చేసుకోవచ్చు. గతంలో ప్రభుత్వం బిందు సేద్యం యంత్రాలు సబ్సిడీపై అందించింది. రైతులు సరిగా వినియోగించకపోవడంతో చాలా చోట్ల నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇలా వదిలేయడంతో యంత్రాలు పూర్తిగా దెబ్బతిని పని చేయకుండా పాడైపోతాయి. రానున్న రోజుల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కూరగాయల సాగు, రైతులు నీటి యాజమాన్య పద్ధతులు సక్రమంగా అవలంభిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

రసాయన ఎరువుల ఆదా..

పంట దిగుబడి 20–30 శాతం పెరుగుతుంది. ఖచ్చితమైన రీతిలో ఎరువులు సరఫరా చేయవచ్చు. మొక్కల అవసరాలను బట్టి పోషకాలు అందించవచ్చు. పోషక నష్టాలను తగ్గిస్తుంది. స్థూల, సూక్ష్మ పోషకాలు ఒకే సారి మొక్కకు అందించవచ్చు. ఎరువులు అవసరైన మోతాదులో ఇవ్వవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

నీటిలో కరిగే ఎరువులు మాత్రమే డ్రిప్ ద్వారా ఇవ్వాలి. మోతాదుకు మించి ఇవ్వకూడదు, ఇస్తే పంట దెబ్బ తింటుంది. అంతే కాకుండా పోషకాల వడపోత జరిగి భూగర్భ జలాలు కలుషితం అవుతాయి. రసాయనిక ఎరవుల కలయిక గురించి అవగాహన ఉండాలి. నీటి పంపిణీ చేసే పరికరాలు తుప్పు పట్టకుండా చూసుకోవాలి. డ్రిప్ నీటిని ఎప్పుడు తాగునీటిగా వినియోగించవద్దు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఖిల్లాఘనపురం: మండలంలోని దొంతికుంట తండా ఉన్న తెలంగాణ మోడల్ పాఠశాల విద్యార్థిని కే.నీలావతి రాష్ట్రస్థాయి అండర్–17 బాలికల విభాగం హాకీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వాణికుమారి, పీఈటీ చందర్ గురువారం తెలిపారు. ఈ నెల 11న వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి హాకీ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిందని తెలిపారు. 17 నుంచి 19వ తేదీ వరకు వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్–17 బాలికల హాకీ పోటీల్లో పాల్గొంటుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని అధ్యాపక బృందం అభినందించారు.

ఆటోడ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపించాలి



సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటోడ్రైవర్లు రోడ్డున పడ్డారని దీంతో వారికి జీవన ఉపాధి కోసం ప్రత్యామ్నాయం చూపించాలని తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి, కార్యదర్శి పొదిల రామయ్యలు డిమాండ్ చేశారు. గురువారం ఆటో యూనియన్ నాయకులతో ఏర్పాటు సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల మంది రవాణా రంగ కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. సంవత్సరానికి రూ.12 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని ఇది వెంటనే అమలు చేయాలన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో రంగాల యూనియన్ నాయకులు చింతకాయల శివ, మల్లేష్, సైదులు, మహేష్, సుబ్బయ్య, సుల్తాన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ



డిగ్రీ కళాశాల వద్ద నిర్మిస్తున్న సర్వీస్‌రోడ్డు వాల్స్

- సర్వీస్‌రోడ్ వాల్స్, వంతెనకోసం నిర్మాణాలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని సిగ్నల్‌గడ్డపై 167వ నంబరు జాతీయరహదారిపై రోడ్డు విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. రైల్వేలైన్‌పై వంతెన నిర్మాణం కోసం నీళ్లట్యాంక్ ఉన్న వైపు ఫిల్లరు పనులు చేస్తుండగా ఎస్సీహాస్టల్‌వైపు పిల్లర్ నిర్మాణం కోసం హిటాచీ సాయంతో మట్టి తీస్తున్నారు. విస్తరణలో భాగంగా ఎల్‌ఐసీ కార్యాలయం నుంచి కల్వకుర్తిరోడ్డులో డిగ్రీ కళాశాల హస్టల్ వరకు రోడ్డు వేయనున్నారు. పనుల్లో భాగంగానే రైల్వేలైన్‌పై వంతెన నిర్మాణం చేపడుతున్నారు. పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యాక వంతెనకోసం తయారు చేసిన బ్లాగ్స్‌ను అమర్చనున్నారు. ఇదే మార్గంలో డిగ్రీ కళాశాల వద్ద సర్వీస్‌రోడ్డు పనులు చేపట్టారు. ప్రధానరోడ్డు మెయింటెన్స్‌వాల్‌తో పాటు సర్వీస్‌రోడ్డుకు సంబంధించిన వాల్ పూర్తికావస్తోంది. అలాగే రైల్వేట్రాక్ వద్ద వంతెనకు అనుబంధంగా ఇరువైపులా అండర్‌బ్రిడ్జిల నిర్మాణం చేయనున్నారు. డిగ్రీ కళాశాల వెంబడి విస్తరణ పనులు కొనసాగుతుండటంతో నిత్యం వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడుతోంది. ఇదేరోడ్డులో సెయింట్ ఆగ్నేస్ పాఠశాల వైపు ప్రధానరోడ్డుకు సంబంధించిన మెయింటిన్స్ వాల్ నిర్మాణ పనులు సైతం ప్రారంభిస్తున్నారు. ఇందుకోసం హిటాచీల సాయంతో మట్టి తీసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక ఎస్సీహాస్టల్ ప్రహరీ కూల్చివేతకు అనుమతి రాకపోవటంతో అక్కడ పనులు కొంత నెమ్మదించాయి. అనుమతి రాగానే డ్రెయినేజీ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం వేగవంతం చేయనున్నారు.



నీళ్లట్యాంక్‌వైపు రైల్వే వంతెనకోసం నిర్మిస్తున్న పిల్లర్



ఎస్సీహస్టల్ వద్ద వంతెనకోసం ఫిల్లర్‌నిర్మాణం కోసం తీస్తున్న మట్టి

మైసూర్ ఎంపీని సస్పెండ్ చేయాలి

ఆత్మకూర్: పార్లమెంట్‌లో ఆగంతకులు చొరబడి అలజడి సృష్టించిన వారికి పాస్‌లు ఇచ్చిన మైసూర్ ఎంపీ ప్రతాప్ సింహాను సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, కార్యదర్శి రహ్మతుల్లా మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీలు తప్పుచేస్తే అదితప్పే కాదని విపక్షాలకు చెందిన ఎంపీలపై ఆరోపణలు వస్తే చర్యలు తీసుకుంటారని దుయ్యబట్టారు. గతంలో రాహుల్‌గాంధీపై అన్హరతవేటు వేశారని, నివాసమున్న ఇంటినిసైతం లాక్కున్నారని, ఈ మధ్యనే ఎంపీ మహువా మొయిత్రపై నిరాధారమైన ఆరోపణలతో చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగిన రోజునే ఘటన జరగడం భద్రతా వైఫల్యాలు పాలకుల నిర్లక్ష్యమేనని అన్నారు. విపక్షాలకు చెందిన ఎంపీలు ఆగంతకులకు పాస్‌లను ఇచ్చి ఉంటే రాద్ధాంతం చేసేవారని, మీడియా అదే పనిక ట్టుకుని కోడై కూసేదని దుయ్యబట్టారు. బీజేపీ ఎంపీని సస్పెండ్ చేసి, ఘటనకు బాధ్యత వహించి హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

పాన్‌గల్: ఘర్షణకు పాల్పడిన ముగ్గురిపై గురువారం కేసు నమోదైంది. ఎస్‌ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన భార్యాభర్తలు లక్ష్మి, చంద్రూ వారి ఇంటి స్థలంలో పనిచేసుకుంటూ ఉండగా, పాత కక్షల నేపథ్యంలో కేతావత్ చందర్, కేతావత్ శంకర్, కేతావత్ గోరి దాడి చేశారు. దీంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. పాతకక్షలను మనుస్సులో పెట్టుకొని మాపై అకారణంగా దాడి చేసి గాయపర్చిన ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఏకకాల రుణ చెల్లింపులకు అవకాశం

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల పీఏసీఎస్‌లో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న బకాయిదారులకు ఏకకాల రుణ పరిష్కార పథకం (ఓటీఎస్–2023) అందుబాటులో ఉందని సీఈఓ జగదీశ్వర్‌రెడ్డి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకంలో రుణం తీసుకున్న వారికి పెనాల్టీ మొత్తం మాఫీ చేస్తామని, అసలు, వడ్డీ చెల్లించి రుణ విముక్తి పొందాలని కోరారు. ఈ అవకాశం డిసెంబర్ 31వరకు ఉంటుందని, వివరాలకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు.

మంత్రి జూపల్లిని కలిసిన నాయకులు

పాన్‌గల్: మంత్రి జూపల్లి కృష్ణారావును గురువారం సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి జబ్బార్ ఆధ్వర్యంలో రేమద్దుల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు గ్రామాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటునందించాలని వారు మంత్రిని కోరారు.కార్యక్రమంలో సాగర్, వెంకట్రాములు, పర్వతాలు, రమణ, మేస్త్రీ శివయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

అడ్డాకుల: సంకలమద్ది శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలానికి చెందిన ప్రవీణ్ కుమార్ ద్విచక్రవాహనంపై మూసాపేట వైపు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో శ్రీకృష్ణ హోటల్ దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. తలకు తీవ్రగాయం కావడంతో స్థానికులు బాధితుడిని 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి.. తరువాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా ప్రమాదం జరిగినప్పుడు ఎవరూ చూడకపోవడంతో ద్విచక్రవాహనాన్ని ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందా...లేక అతడే అదుపు తప్పి కిందపడ్డాడా అనే విషయం తెలియరాలేదు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

కోర్టు ఆవరణలో తాగు నీటి ట్యాంకు ఏర్పాటు



కొల్లాపూర్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంక్‌ను గురువారం మేజిస్ట్రేట్లు ఆర్‌వీఎస్‌ఎస్ మిధున్‌తేజ, జ్యోత్స్న గుంటిలు ప్రారంభించారు. కోర్టుకు వచ్చే క్షిదారులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. క్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.వసంతరెడ్డి, న్యాయవాదులు, సిబ్బంది ఉన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏఓ షేక్ మున్నా

కొత్తకోట రూరల్: ఇటీవల భూములకు సంబంధించి కొత్తగా పాస్‌బుక్కులు పొందిన వారు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి షేక్ మున్నా రైతులకు సూచించారు. గురువారం రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో కొత్తగా 882మంది రైతులు పాస్ పుస్తకాలు పొందారన్నారు వారందరూ దరఖాస్తు చేసుకుంటే ప్రస్తుతం రైతుబంధు డబ్బులు వారి ఖాతాల్లో జమవుతాయన్నారు. పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రవీందర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

ప్రొటోకాల్‌పై మాట్లాడటం హాస్యాస్పదం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్: స్థానిక మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్‌కు ప్రొటోకాల్ గురించి ఏం తెలుసు అని, గతంలో ఎన్ని రకాలుగా అవమానపరిచారో మరిచిపోయారా అని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్ ప్రశ్నించారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాలన ఎలా ఉంటుందో వచ్చే రోజులు చూస్తారని, మీలాగ మాత్రం ఉండదన్నారు. మున్సిపల్ చైర్మన్ ప్రభుత్వం ఏర్పడి పది రోజులు కాకముందే కొత్త నిధులు తేవాలని చెబుతున్నారని, మేము గురువారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేంత వరకు మున్సిపల్ చాంబర్‌లో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ఫొటోలు తొలగించలేదని, ఇదేం ప్రొటోకాల్ అని నిలదీశారు. మున్సిపల్ చైర్మన్‌కు అధికారులను హెచ్చరించే స్థాయి ఉందా ప్రశ్నించారు. ఎవరికి ఇచ్చే మర్యాదలు వారికి ఇస్తూ ప్రొటోకాల్‌ను కచ్చితంగా పాటించి తీరుతామని, బీఆర్‌ఎస్‌లా నియంతృత్వంగా వ్యవహరించమన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం ప్రారంభం కాని పనులకు ఎమ్మెల్యే ప్రారంభిస్తే తప్పు పట్టాల్సినంత ఏముందని మండిపడ్డారు. త్వరలో ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటారన్నారు. కౌన్సిలర్లు వెంకటేష్, బ్రహ్మం మాట్లాడుతూ.. వనపర్తి మున్సిపాలిటీలో అవినీతి జరిగిందని నిరూపిస్తామని, జరగలేదని చైర్మన్ నిరూపిస్తే జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో ముక్కు, నాలుక నేలకు రాయాలని సవాలు విసిరారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో రేకుల షెడ్డు తొలగించి, డోర్‌లు పగలగొట్టి, వైర్‌లు లాగేసినప్పుడే బీఆర్‌ఎస్ పరువు పోయిందని, అలాంటి నాయకులు కాంగ్రెస్‌కు నీతులు చెప్పడం ఏంటని ఎద్దేవ చేశారు. వనపర్తి స్వీపింగ్ మిషన్ కొనుగోలులో రూ.56లక్షల అవినీతి అయినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ చీర్ల సత్యం మాట్లాడుతూ.. చైర్మన్‌కు నాయకత్వ లక్షణాలు లేవని, తాను మొన్నటి వరకు బీఆర్‌ఎస్‌లో ఉన్న ఏ నాడు ప్రొటోకాల్ పాటించలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సతీష్, రాములు, కౌన్సిలర్‌లు జయసుధ మధుగౌడ్, సుమిత్ర, నారాయణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప ఇరుముడి



ఖిల్లాఘనపురంలో అయ్యప్ప భక్తుల ఇరుముడి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని కమ్మరిగేరి శివాలయం వద్ద గురువారం అయ్యప్ప భక్తుల ఇరుముడి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 13 మంది ఇరుముడి కట్టారు. అంతకుముందు దేవాలయం వద్ద పడిపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఇరుముడి కట్టుకున్న వారిని బాజాభజంత్రీలతో గ్రామం వెలుపలి వరకు సాగనంపారు.

కొత్తకోట: పట్టణ సమీపంలో భైతనాథ అన్నదాన అయ్యప్ప క్షేత్రాన్ని కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి సందర్శించారు. క్షేత్రంలో గల అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

తపాలా ఉద్యోగుల సమ్మెకు మద్దతు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని తపాలా కార్యాలయంలో గురువారం గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మెకు డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 8 గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని, 2016 నుంచి టీఆర్సీ రేషనల్ ఫిక్షేస్‌తో సహా రెగ్యూలర్ ఎంప్లాయిస్‌కు ఇస్తున్న ప్రయోజనాలను వీరికి కల్పించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ప్రకారం కొత్తగా నియమించబడిన జీడీఎస్‌లకు ఐదు గంటల పనికి సెకండ్ టీఆర్‌ఏ ఇవ్వాలని, రెగ్యూలర్ స్టాఫ్‌కు జీడీఎస్‌లకు ఇంక్రిమెంట్‌లు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అసంపూర్తిగా డ్రెయినేజీ నిర్మాణాలు



పాఠశాల సమీపంలో అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీ

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో అసంపూర్తి డ్రెయినేజీ నిర్మాణంతో మురుగు వాసనతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు, సమీప ఇళ్ల యజమానులు వాపోతున్నారు. గతంలో ఉన్న డ్రెయినేజీ ధ్వంసమైందని దానియొక్క రాయిని తొలగించి డ్రెయినేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు సక్రమంగా ముందుకు వెళ్లక అక్కడే నిల్వ ఉంటుందన్నారు. అధికారులు, పంచాయతీ వారు స్పందించి ఇబ్బందులు తొలగించాలని వాపోతున్నారు.

ప్రాజెక్టుపై వెలగని లైట్లు



ప్రాజెక్టుపై వృథాగా ఉన్న విద్యుత్ స్తంభాలు

అమరచింత: జూరాల ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన బల్బులు వెలగని కారణంగా రహదారి రాత్రి వేళ చీకటిగా మారుతుంది. ప్రాజెక్టు రహదారి నుంచి కర్ణాటక రాష్ట్రానికి వెళ్లడానికి రోడ్డుమార్గం ఉండటంతో ప్రయాణికులు రాత్రి వేళ వెళ్లేందుకు జంకుతున్నారు. ఎడమ కాల్వ సమీపంలో చేపలు పట్టి విక్రయించే జాలర్లతో పాటు చేప వంటకాలు తయారుచేస్తున్న వారుసైతం సాయంత్రం అయ్యిందంటే ఇంటి ముఖం పట్టే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాజెక్టు అధికారులు స్పందించి రాత్రి వేళ బల్బులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రజల పక్షాన నిలబడతాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన ఉంటూ పోరాడుతామని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన తొలిసారిగా గురువారం పట్టణంలో నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. సోమశిల బ్రిడ్జి, జాతీయ రహదారి మంజూరు చేయించానని పేర్కొన్నారు. కొల్లాపూర్‌కు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల, పెద్దకొత్తపల్లికి జూనియర్ కళాశాలలు తీసుకొచ్చానన్నారు. ఇటీవల కాలంలో కొందరు రాజకీయ కక్షతో ఇళ్లలోకి చొరబడి దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. సమావేశంలో రంగినేని అభిలాష్‌రావు, రాంచందర్‌యాదవ్, డీకే.మాదిగ, కృష్ణమూర్తి, శంకర్‌నాయక్, సునీల్‌నాయక్, గుజ్జుల పరమేష్‌తో పాటు పలువురు ఉన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

పెద్దకొత్తపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమితో కార్యకర్తలు అధైర్యపడొద్దని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాతాపూర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల తీర్పును అందరు గౌరవించాలన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటమిలు సహజమని వివరించారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుదామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అభిలాష్‌రావు, రాజేందర్‌గౌడ్, వెంకటయ్య, నర్సింహ, పరమేష్ పాల్గొన్నారు.